


వెంగళరావునగర్ అయ్యప్ప మైదానం వద్ద కొట్టేసిన చెట్ల కొమ్మలు
మధురానగర్ సి-బ్లాక్ లో రహదారిపై వేసిన కొమ్మలు

చెట్ల కొమ్మలను తొలగించేదెప్పుడో..?

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

వెంగళరావునగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్‌లోని మధురానగర్, వెంగళరావునగర్, సిద్ధార్థనగర్ కాలనీలలోని పలు వీధుల్లో వారం రోజుల క్రితం గణపతి శోభాయాత్రకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను సిబ్బంది కొట్టేశారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సి ఉన్నా రహదారి పక్కన, ఫుట్‌పాత్ పైన పడేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకులు ఎండిపోయి గాలికి రహదారిపై పేరుకుపోతున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రైవేట్ వైద్య కళాశాలల్లో దళిత విద్యార్థులకు
25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలి

పంజాగుట్ట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ (ఆర్టీఈ) ప్రకారం ప్రైవేట్ వైద్య కళాశాలలు, ప్రైవేట్ విద్యా సంస్థలలో దళిత విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి, రాష్ట్ర అధ్యక్షుడు నిరగొండ బుచ్చన్నలు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రైవేట్ వైద్య కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు స్పందించకపోతే సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. పేద దళిత విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని తెచ్చిందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలోతొక్కి పేద విద్యార్థులను దోచుకుంటూ విద్యకు దూరం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న ఆరోగ్య మిత్రలు

డిమాండ్లు నెరవేర్చాలని ఆరోగ్యమిత్రల ధర్నా

బోరబండ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): జీఓ నంబర్ 60 ప్రకారం ఆరోగ్యమిత్రలకు నేరుగా ట్రస్ట్ నుంచి 22.750 వేతనం ఇచ్చి డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ (డీఓపీ) క్యాడర్‌గా గుర్తించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గౌరవ అధ్యక్షుడు భూపాల్, అధ్యక్షుడు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భవనం ఎదుట ఆరోగ్య మిత్రలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మిత్రలు 17 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నమన్నారు. మిత్రలకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వేతనం కాకుండా ట్రస్ట్ ద్వారా జీతం ఇవ్వలన్నారు. అర్హత, అనుభవం బట్టి మిత్రలకు పీహెచ్‌సీలో ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులు ఇచ్చి, చనిపోయిన మిత్ర కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా అందించాలన్నారు. సమ్మె చేస్తున్న మిత్రలతో వైద్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షుడు గోవర్ధన్, నాగరాజు, విష్ణు, కిషోర్, జగన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 2 నుంచి 13 వరకు జరిగిన ఆల్ ఇండియా టీఎస్‌సీ షూటింగ్ పోటీల్లో జరిగాయి. పోటీల్లో యూసూఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వెంకటసాయి, ఆదాం సామి ఆంధ్ర-తెలంగాణ డైరెక్టరేట్‌లో రెండో స్థానంలో గెలిచి సత్తాచాటి మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను హైదరాబాద్ విద్యాశాఖ అధికారి రోహిణి పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ప్రభాకర్, హెచ్‌ఎం పరమేశ్వరమ్మ, టీచర్లు నరసింహారావు, శ్రీవత్సవ, మణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ సర్జరీ సదస్సులో ప్రొఫెసర్ లక్ష్మి

ఉస్మానియా ప్రొఫెసర్‌కు పురస్కారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో నిర్వహిస్తున్న జాతీయ ప్లాస్టిక్ సర్జరీ సదస్సులో ఉస్మానియా ఆస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మికి మెంటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం అందజేశారు. దేశ వ్యాప్తంగా ప్లాస్టిక్ సర్జరీ వైద్య విద్యార్థుల కోసం క్లినిక్‌లో ప్లాస్టిక్ ఛాలెంజ్ ఫైనల్స్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మి విద్యుత్‌ఘాతం వల్ల కాలిన గాయాలకు చికిత్స అందించడం, వాటిని పునర్నిర్మించడం, ఎలా యానిమెట్ చేయడం వంటి అంశాలపై తన అనుభవాలను వివరించారు. ఉస్మానియా ఆస్పత్రిలో బాధితులకు అందించిన చికిత్స వివరాలను చెప్పారు. ఈ చికిత్సలో కోలుకుని సాధారణ జీవనం గడుపుతున్న వారి వివరాల వీడియోలను చూపించారు. పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఆమె సభ్యురాలిగా ఎంపికైంది. కార్యక్రమంలో ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రోహిత్మల, ఉస్మానియా నుంచి వైద్య విద్యార్థులు సందీప్‌రెడ్డి, స్వాతి, శంకర్, అజోలు ప్లాస్టిక్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు.

టపాసులు పేలిన ఘటనలో గాయపడ్డ మహిళ మృతి

● మరొకరి పరిస్థితి విషమం

మదీన, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): టపాసులు నిల్వ ఉంచిన ఇంట్లో పేలుడు జరిగి గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాళీబుగ్గ ఆలయం సమీపంలో టపాసులు తయారు చేస్తున్న ఓ ఇంట్లో బుధవారం సాయంత్రం పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఇంటి యజమాని దీపావళి కోసం ఉపయోగించే టపాసులు, ముడిసరుకును నిల్వ ఉంచాడు. ప్రమాదవశాత్తు పేలుడు జరగడంతో ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో షాకీరాబేగం(60), కూతురు సమీనాబేగం(27) తీవ్రంగా గాయపడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో షాకీరాబేగం బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. సమీనాబేగం పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా, అక్రమంగా టపాసులు, వాటి తయారీకి ఉపయోగించే ముడిసరుకు నిల్వ ఉంచినందుకు ఇంటి యజమాని మహ్మద్ వసీంపై కేసు నమోదు చేసినట్లు బహదూర్‌పురా పోలీసులు తెలిపారు.

నాలుగేళ్లుగా నిలిచిన
సామాజిక భవన నిర్మాణ పనులు

● కోర్టు నోటీసులతో నిలిచిన కమిటీ హాల్
● పాఠశాల కావాలని స్థానికుల డిమాండ్



నిలిచిపోయిన కమ్యూనిటీటి హాల్ భవనం, ఇన్‌సెట్‌లో జీహెచ్‌ఎంసీ నోటీసు బోర్డు

బోరబండ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ వినాయకనగర్ నుంచి 25 ఏళ్ల క్రితం బోరబండ మధురానగర్‌కు బాలజ్యోతి పాఠశాలకు మార్చారు. నాటి నుంచి బాలజ్యోతి భవనంలో సమీపంలోని పిల్లలకు విద్యను బోధించేవారు. పురాతన భవనం కావడంతో 2020లో ప్రజల అవసరాల కోసం 92.70 లక్షలతో విశాలమైన, ఆధునిక సదుపాయాలతో సామాజిక భవన నిర్మాణ పనులను ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు నాలుగేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. మార్చి 2023లో కె.రాములు అనే స్థానికుడు కమ్యూనిటి హాల్ వద్దు, పాఠశాల కావాలని కోర్టులో పిటిషన్ వేశాడు. రాములు ఫిర్యాదును స్వీకరించిన కోర్టు కమ్యూనిటీ హాల్ పనులు నిలిపివేయాలని డిసెంబర్ 2022న జీహెచ్‌ఎంసీ అధికారులకు నోటీసులు జారీ చేసింది. దీంతో పనులు నిలిచిపోయాయి.

వర్గపోరుతో...

మధురానగర్ సామాజిక భవనం 2020లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్‌లు కలసి పనులను ప్రారంభించారు. గడిచిన కాలంలో రాజకీయంగా వచ్చిన మార్పుల్లో భాగంగా మాజీ డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనికి తోడు బస్తీ కమిటీ కూడా రెండు వర్గాలుగా వీడిపోయి భిన్నాభిప్రాయాలతో ఉన్నారు. ప్రజా ప్రతినిధుల వలనే కమిటీ హాల్ పనులు నిలిచిపోయాయి ప్రజలు అనుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో పనులు ఆగిపోయాయని ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారు.

పనులు ప్రారంభిస్తాం

మధురానగర్ కమ్యూనిటీ హాల్ రెండు అంతస్తులు స్లాబ్ పనులు పూర్తయ్యాయి. కోర్టు ఆదేశాలతో పనులను నిలిపివేశాం. కోర్టు నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం జరిగిన నిర్మాణంలో ప్రైవేట్ వ్యక్తులు ఫంక్షన్ లాంటి కార్యక్రమాలు ఎవరు నిర్వహించిన చర్యలు తీసుకుంటాం.

-ఈఈ రాజ్‌కుమార్, సర్కిల్-19

ఎస్సీ వర్గీకరణపై వేసిన కమిటీని రద్దు చేయాలి

● జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి
● దళితులను విభజించే హక్కు ప్రభుత్వాలకు లేదు



అభివాదం చేస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన క్యాబినెట్ సబ్ కమిటీని వెంటనే రద్దు చేసి జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మేధావులు పి.రత్నం, భావన సాహెబ్, సమితి కో కన్వీనర్లు నాయకులు కరణం కిషన్, జంగా శ్రీనివాస్, అంబేద్కర్, సుధీర్, శంకర్, బత్తుల రాంప్రసాద్ తదితరులతో కలిసి మాట్లాడారు. వర్గీకరణ తీర్పుపై దళిత సామాజిక వర్గానికి చెందిన అన్ని కులాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయని వారు అన్నారు. దళితులను విభజించే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని సమితి కో కన్వీనర్ చెరుకు రాంచందర్ అన్నారు. వర్గీకరణ రద్దు అయ్యే వరకు తమ పోరాటం ఆగదని, వర్గీకరణకు, సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా 33 జిల్లాలు తిరిగి సభలు, సమావేశాలు పెట్టి నిరసన కార్యక్రమాలు చేపడుతామని, నవంబర్ నెలలో లక్షలాదిమందితో చలో హైదరాబాద్ పేరుతో నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమగ్ర కులగణన చేపట్టి నిజంగా వెనుకబాటును అనుభవిస్తున్నది ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సమితి నాయకులు మన్నే రంగ, రుక్మిణి, లలిత, రమ, భాస్కర్, రమేష్, సత్యనారాయణ, నవీన, చేతన తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

● డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి



యూపీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ వెంకటి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సిబ్బంది అందరూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎం అండ్ హెచ్‌ఓ) డాక్టర్ జె.వెంకటి ఆదేశించారు. గురువారం రసూల్‌పురాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)తో పాటు చంద్రబాబు నగర్‌లోని బస్తీ దవాఖానాను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది విధుల నిర్వహణ, సమయపాలన, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, ఔషధ నిల్వలు, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత పాటించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోగులకు వసతి, దోమలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నెలవారీ సమీక్ష..

వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ల నెలవారీ సమీక్ష సమావేశంలో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి పాల్గొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలు, గర్భిణుల నమోదు, పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు తమ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, బస్తీ దవాఖానాలను విధిగా సందర్శించి, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని డీఎం అండ్ హెచ్‌ఓ సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్.ఓ డాక్టర్ జయమాలిని, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రుక్మారెడ్డి, డాక్టర్ ఆశ్రిత, కార్యాలయ పరిపాలనాధికారి సునీల్ కుమార్, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, డిప్యూటీ డెమోలు, డీపీఓ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



మిలాద్-ఉన్-నబీ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ నాయకుడు, క్రికెటర్ అజారుద్దీన్, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ తదితరులు



బోరబండలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లింలు వివిధ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. బోరబండలో జరిగిన ర్యాలీని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు, వేడుకలను కులమతాలకతీతంగా సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డిగూడ ఇమాం గూడలో జరిగిన వేడుకల్లో టీపీసీసీ నాయకుడు, మాజీ క్రికెటర్ అజారుద్దీన్, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

23న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

● భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక



సమావేశంలో అభివాదం చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక నేతలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం తదితర నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని ప్రయత్నిస్తుందని, ఈ నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు, గౌరవ అధ్యక్షుడు ఓంగోలు రాములు, తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అనుమోష్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అనురాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్య, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, కుమార్, తెలంగాణ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఇ.చిన్నారావు మాట్లాడారు. ఈనెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు అడ్వయిజరీ కమిటీని నియమించి నిధులు దారి మళ్లకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.



సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించి కార్యకర్తలకు సభ్యత్వాలు అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బీజేపీతోనే సుస్థిర పాలన

● మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశ వ్యాప్తంగా సుస్థిర పాలన సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్‌లో గురువారం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కోటి సభ్యత్వాలను చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు చెప్పారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్కరు బీజేపీని అభిమానించడంతో పాటు స్వచ్ఛందంగా వచ్చి పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటున్నారన్నారు. పార్టీ కార్యకర్తలు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, గడ్డం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలు అందజేత

పంజాగుట్ట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం ద్వారా ఐదు వందలకే ఎల్పీజీ సిలిండర్‌ను అందించాలనే లక్ష్యంతో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 94,746 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని నేరుగా బ్యాంకు ఖాతాలో వేస్తుందని అన్నారు. గురువారం బీస్టీవాడ రేషన్ షాపు దుకాణంలో 271 మంది లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను ఆమె అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సనత్‌నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ

కలుషిత నీటి సరఫరా

సనత్‌నగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్ అల్లాఉద్దీన్ కోఠిలో కొన్ని రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీనిపై ప్రజలు ఫిర్యాదు చేయగా, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అల్లాఉద్దీన్ కోఠిలో పర్యటించారు. రంగుమారిన నీటిని పరిశీలించారు. కలుషిత నీటి సరఫరా విషయమై చాలా కాలంగా ఫిర్యాదులు వచ్చినా స్పందించని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా సమస్య పరిష్కారమయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు.

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానం



మురుగేందర్ స్వామి (ఫైల్)

సనత్‌నగర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి జీవన్‌దాన్ సభ్యులు అవయవాలు సేకరించారు. మెదక్ నర్సాపూర్‌కు చెందిన బీడీమెట్ల మురుగేందర్ స్వామి (46) చిరు వ్యాపారి. ఈ నెల 15న బైక్‌పై వెళుతున్న మురుగేందర్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వైద్యానికి అతను స్పందించకపోవడంతో వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ సభ్యులు మురుగేందర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానానికి ఒప్పించి కిడ్నీలు, లీవర్ సేకరించారు.

త్వరలో బీదల బస్తీలో రోడ్లు నిర్మిస్తాం



బీదలబస్తీలో మహిళలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

బౌద్ధనగర్, సెప్టెంబర్19 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ గురువారం బీదల బస్తీ, ఎక్‌సెంబర్ గల్లీలో అధికారులతో కలిసి పర్యటించారు. బస్తీ మహిళలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నూతన రోడ్లను నిర్మించాలని బస్తీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. అధికారులతో చర్చించి ప్రతిపాదనలు పెట్టామని త్వరలో నూతన రోడ్లను నిర్మిస్తామని కార్పొరేటర్ తెలిపారు. దేవీ నవరాత్రులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం నామాలగుండులో నూతనంగా నిర్మిస్తున్న జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయ పనులను ఏఈ కౌశిక్‌తో పరిశీలించారు. రూ.1.90 కోట్లతో చేపడుతున్న ఈ భవన నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. నాయకులు లక్ష్మి, చందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి



విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చిలకలగూడ, సెప్టెంబర్19(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్‌లు అందజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మారేడుపల్లి లయన్స్ క్లబ్ వవస్థాపక అధ్యక్షుడు వైసీ సుంకీ మాట్లాడుతూ.. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని చదువుకొని క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు టి.స్వరాజ్,ఐయోనా డిమ్మీపాఠశాల ఉపాధ్యాయుడు కె. మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు నాగశృతి, హసీనాబేగం తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యే నివాసంలో విషాదం

● గుండెపోటుతో సోదరి మృతి



సోదరి భౌతిక కాయం వద్ద ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

మారేడుపల్లి, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి):కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఇంట విషాదం చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం 7 గంటల కు ఎమ్మెల్యే పెద్ద అక్క విజయకుమారి గుండె పోటుతో మరణించారు. కార్ఖానాలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. తిరుమలగిరిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా డాక్టర్లు చనిపోయినట్లు నిర్ధారించారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ తల్లిదండ్రులకు 8 మంది సంతానం కాగా ఇద్దరు అక్కలు, నలుగురు అన్నలు, ఒక తమ్ముడు ఉన్నారు. పెద్ద అన్న తాజన్న 2015లో చనిపోయారు. ఇప్పుడు పెద్ద అక్క విజయకుమారి మృతి చెందారు. ఆమె భౌతిక కాయానికి పలువురు రాజకీయ నాయకులు, కాంగ్రెస్ నాయకులు నివా ళులర్పించారు. అనంతరం మెటుగూడలోని సెయింట్ ఆంథోనిస్ చర్చిలో ప్రార్థనలు జరిపి, బోయిగూడలోని క్యాథలిక్ సెమెట్రిలో అంత్యక్రియలు నిర్వహించారు.

బీజేపీ నాయకుడికి నివాళులర్పించిన తలసాని



నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ యాదవ్

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడికి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాళులర్పించారు. మోండా మార్కెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు అశోక్ బుధవారం మృతి చెందారు. గురువారం అశోక్ మృతదేహానికి తలసాని నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్ గౌడ్, ఆకుల హరికృష్ణ, రాములు, కిషోర్, మహేష్ యాదవ్, చందు తదితరులు అశోక్ మృతదేహానికి నివాళులర్పించారు.

బైక్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి

తిరుమలగిరి, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనంపై వెళ్తూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. గురువారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. ఎస్సై అంథోనమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ వెంకటాపురానికి చెందిన నాగరాజు(21) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 18న సికింద్రాబాద్ నుంచి అల్వాల్‌కు బైక్‌పై స్నేహితుడు శివతో కలిసి వేగంగా వెళ్తున్నాడు. తిరుమలగిరి ఫుట్‌బాల్ మైదానం సమీపంలో బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో స్నేహితుడు శివకు రెండు కాళ్లు విరిగిపోయాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

23న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి

● భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక

బర్కత్‌పుర, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని, ప్రభుత్వమే బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం తదితర నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి తమ బాధ్యతల నుంచి తప్పుకోవాలని ప్రయత్నిస్తుందని, ఈ నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటంరాజు, గౌరవ అధ్యక్షుడు ఓంగోలు రాములు, తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అనుమోష్, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అనురాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్య, స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, కుమార్, తెలంగాణ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఇ.చిన్నారావు మాట్లాడారు. ఈనెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించి లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు.

బస్సుల కోసం రోడ్లపైనే పడిగాపులు

● పరేడ్‌గ్రౌండ్ మెట్రో రైల్వే స్టేషన్ వద్ద ఇదీ పరిస్థితి ● బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అగచాట్లు





పరేడ్‌గ్రౌండ్ మెట్రో రైల్వే స్టేషన్ ప్రధాన కూడళ్ల వద్ద బస్సుల కోసం రహదారులపై ఎదురు చూస్తున్న ప్రయాణికులు

మారేడుపల్లి, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రధాన కూడళ్ల రోడ్లపైనే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు.. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రమాదకర పరిస్థితుల్లో బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు.. ఇలా బస్సుల కోసం వేచి చూస్తున్న వారిలో మహిళా ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. చౌరస్తాల్లో రోడ్లపై నిలబడటం వల్ల ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరేడ్‌గ్రౌండ్ మెట్రో రైల్వే స్టేషన్ ప్రధాన కూడళ్ల వద్ద పరిస్థితే ఇందుకు నిదర్శనం..

ముఖ్యంగా వైడబ్ల్యూసీఏ ప్రాంగణంలోని సిద్ధి వినాయక ఆలయం వద్ద గల ప్రధాన రాహదారిలో ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ప్రయాణికులు రోడ్లపై నిలబడి బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. గతంలో ఇక్కడ ఉన్న బస్సు షెల్టర్‌ను మెట్రో స్టేషన్లు ఏర్పాటు చేస్తున్న సమయంలో తొలగించారు. మళ్లీ షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు ఈ దుస్థితి నెలకొంది. ఇదే ప్రాంతంలో ఉన్న పరేడ్ గ్రౌండ్ మెట్రో రైల్వే స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్ మెట్రో రైల్వే స్టేషన్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు ఉద్యోగం, వివిధ పనులపై రాకపోకలు సాగించే వారికి ఇది అతి ముఖ్యమైన ఆర్టీసీ బస్ పాయింట్. దీంతో మెట్రో రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య కూడా వేలాదిగా ఉంటుంది. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు రెండు పెద్ద మెట్రో రైల్వే స్టేషన్లు ఉండటంతో ఈ బస్టాప్ బస్సులు దిగి, ఎక్కేవారికి చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. దీంతో ఈ ప్రదేశం ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళా ప్రయాణికులతో రద్దీగా మారుతోంది. షెల్టర్ లేక రోడ్లపైనే నిలబడటంతో ఎపుడు ప్రమాదం ముంచుకొస్తుందో, ఏ వాహనం ఢీకొట్టి పోతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గమనించి పరేడ్ గ్రౌండ్ మెట్రో రైల్వే స్టేషన్ ప్రధాన కూడళ్ల వద్ద బస్ షెల్టర్లను పునరుద్ధరించాలని ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులను అందుబాటులో ఉంచడంతో పాటు ఆర్టీసీ కంట్రోలర్‌ను నియమించి మహిళా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ తదితరులు



సీతాఫల్‌మండిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ వేడుకలు

బౌద్ధనగర్, సెప్టెంబర్19(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీని గురువారం బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో ఘనంగా జరుపుకున్నారు. వారాసిగూడ కౌసర్ మసీద్, మహ్మద్‌గూడ, శ్రీనివాసనగర్, చిలకలగూడ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారాసిగూడ, బౌద్ధనగర్, మహ్మద్‌గూడ, సీతాఫల్‌మండి, చిలకలగూడ తదితర ప్రాంతాల్లో వాహనదారులకు, పాదచారులకు అన్నదానం చేయటంతో పాటు షర్బత్‌ను పంపిణీ చేశారు. వారాసిగూడ చౌరస్తా నుండి షాబాద్‌గూడ, శ్రీనివాసనగర్, పద్మారావునగర్, చిలకలగూడ, మైలార్‌గడ్డ, సీతాఫల్ మండి, నామాలగుండుల మీదుగా వారాసిగూడ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, సైదులు, డీఐ రమేష్‌గౌడ్, అడ్మిన్‌ఎస్సై సుధాకర్, ఎస్సై జ్ఞానేశ్వర్‌లు బందోబస్తు నిర్వహించారు. వారాసిగూడ చౌరస్తాలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మహ్మద్ అమీద్, ఎండీ రఫీక్, ఖరీమ్, నజీర్, షకీర్, సల్మాన్, గౌస్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా అడ్డగుట్ట నుంచి తుకారాంగేట్ పరిసర ప్రాంతాల వరకు ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

(అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

పెచ్చులూడిపడ్డ జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇంటి పైకప్పు

తృటితో తప్పిన ప్రమాదం



పై కప్పుకు పెచ్చులూడిన దృశ్యం



శాస్త్రీనగర్ బస్తీలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయం

అడ్డగుట్ట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ఒక్కసారిగా ఇంటి పైకప్పు పెచ్చులూడి పడడంతో ఆ ఇంట్లోని కుటుంబ సభ్యులందరూ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న శాస్త్రీనగర్ బస్తీ గృహ నిర్మాణ పథకం (జేఎన్ఎన్‌యూఆర్ ఎం) కింద నిర్మించిన గృహసముదాయంలోని ఓ ఇంట్లో జలీల్ అనే వ్యక్తి భార్య పిల్లలతో నివసిస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంట్లో పని చేసుకుంటున్న ఆ కుటుంబీకులు పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడడం చూసి వెంటనే బయటికి పరుగులు తీశారు. రెండు మూడు గదుల్లో ఇదే పరిస్థితి ఉండడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం కింద నిర్మించిన పలు ఇళ్ల పరిస్థితి ఇదే విధంగా ఉండటంతో వాటిలో నివాసం ఉంటున్న వారు ఏ సమయంలో తమ ఇల్లు కూలిపోతాయోనని భయంతో వణికిపోతున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో భాగంగా నిర్మించిన ఈ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, తక్షణం మరమ్మతులు చేసి తమ ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు.

విమానయాన రంగంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లే కీలకం



గ్రాడ్యుయేషన్ వేడుకలో అవార్డు గ్రహీతలతో దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కమాండెంట్ శ్రీనివాస్

అల్వాల్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో 148వ ఎయిర్ ట్రాఫిక్ సర్వీలెన్స్ సర్వీసెస్ (ఏటీఎస్ఎస్), 112 ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఎయిర్ లాస్(బేసిక్) కోర్సు విజయవంతంగా పూర్తి కావడంతో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్స్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏటీసీఓటీఈ) గ్రాడ్యుయేషన్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అకాడమీ కమాండెంట్ ఎయిర్ వైస్ మార్షల్ ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణలో ప్రతిభ కనపరిచిన వారికి ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్స్ ట్రైనింగ్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఏటీసీఓటీఈ) అనేది ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)కు చెందిన ప్రధాన శిక్షణ సంస్థ అన్నారు. విమానయాన రంగంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లదే కీలక పాత్ర అన్నారు. సాయుధ దళాల కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా, దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పాటునందించడంలో ఎయిర్ ట్రాఫిక్ సేవల ప్రాముఖ్యతను ఆయన పునరుద్ఘాటించారు. అధునిక రాడార్లను ఉపయోగించి వాటిని నియంత్రించడం చాలా కీలకమైందన్నారు. విమానయాన రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలన్నారు.ఆరు నెలల పాటు నిర్వహించిన ఎయిర్ ట్రాఫిక్ సర్వీలెన్స్ సర్వీసెస్ కోర్సు, ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోర్సులో భారత వైమానిక దళానికి చెందిన భారత నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు చెందిన అధికారులు, పట్టభద్రులయ్యారు. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, మిత్రదేశాలకు చెందిన వారికి ఇక్కడ శిక్షణ అందిస్తున్నారు.



కేంద్ర మంత్రులపై తుకారాంగేట్ ఠాణాలో ఫిర్యాదు చేసి బయటకు వచ్చిన ఎన్ఎస్‌యూఐ నాయకుడు సృజన్ కుమార్ తదితరులు

కేంద్రమంత్రిపై పోలీసులకు ఎన్ఎస్‌యూఐ ఫిర్యాదు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీకి చెందిన ఒక కేంద్ర మంత్రి, ఒక ఎమ్మెల్యే, పార్టీ నేతపై కేసు నమోదు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు సృజన్ కుమార్ గురువారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీపై లేని పోని ఆరోపణలు చేస్తూ అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి రవనీత్ సింగ్, ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బీజేపీ నేత రఘురాజ్‌లపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మచ్చ లేని నాయకుడు రాహుల్ గాంధీ అని, ఆయనపై నిరాధారమైన ఆరోపణలు చేయడమే కాకుండా అనుచిత వాఖ్యలు చేసినందుకు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాహుల్ గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రుల్ని వెంటనే పార్టీ నుంచి తొలగించాలని సృజన్ ప్రధాన మంత్రి మోదీని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరి, మహేందర్, కోటి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్లూ యూనివర్సిటీ పరిసరాల్లో రోడ్లను శుభ్రం చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

● డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

తార్నాక, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి అన్నారు. తార్నాకలోని ఇఫ్లూ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వ హించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో గురువారం డిప్యూటీ మేయర్ పాల్గొని మాణికేశ్వర్ నగర్, ఇఫ్లూ యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లో స్థానికులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతపై బస్తీవాసులకు, కాలనీ వాసులకు అవగాహన కల్పించే ఉద్దేశంతోనే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



విజయపురి కాలనీలో ఇంటింటికీ వెళ్లి సభ్యనమోదు చేస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, మేకల సారంగపాణి తదితరులు

బీజేపీని మరింత బలోపేతం చేయాలి

● పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ

తార్నాక, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే భారతదేశాన్ని నంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేస్తున్న కృషికి తోడ్పాటు అందించేందుకు బీజేపీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం తార్నాకలోని విజయపురి కాలనీలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వాన్ని తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి, భవిష్యత్‌లో కచ్చితంగా తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్కట్ విజయ్ కుమార్, కనకట్ల హరి, జయశ్రీ, శారదా మల్లేష్, సేతు మహేష్, రాజేష్ నాయర్, నీలం శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ద్రావిడ సంస్కృతి విస్తరణకు ఆది హిందూ సమ్మేళనం

● దక్షిణ భారత పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్ కుమార్ తదితరులు

తార్నాక, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ద్రవిడ సంస్కృతిని విస్తరించడంలో భాగంగా ఆది హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు దక్షిణ భారత పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ. గాలి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం తార్నాకలోని తన కార్యాలయంలో ఆయన ద్రవిడ దార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్ణ కుల అసమానతలను నిర్మూలించేందుకు హైదరాబాద్ లో ద్రవిడ దార్మిక పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక మాసంలో పెద్ద ఎత్తున ఆది హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. విదేశీ ఆర్య సంతతికి చెందిన ఇండియా, ఎన్‌డీఏ కూటములు గత 78 ఏళ్లుగా స్వదేశీ ద్రవిడులను పరిపాలిస్తున్నాయని, వాటి వద్ద నుంచి అధికారాన్ని కైవసం చేసుకోవడమే ద్రవిడ ధార్మిక పరిషత్ లక్ష్యమని ప్రొ. వినోద్ కుమార్ పేర్కొన్నారు.



సదస్సులో పాల్గొన్న ప్రొ. లక్ష్మి తదితరులు

ఉస్మానియా ప్రొఫెసర్‌కు పురస్కారం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కొయంబత్తూరులో నిర్వహిస్తున్న జాతీయ ప్లాస్టిక్ సర్జరీ సదస్సులో ఉస్మానియా ఆస్పత్రి ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ పలుకూరి లక్ష్మికి మెంటర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం అందజేశారు. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ సర్జరీ వైద్య విద్యార్థుల కోసం క్లినిక్‌లో ప్లాస్టిక్ ఛాలెంజ్ ఫైనల్స్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మి విద్యుత్‌ఘాతం వల్ల కాలిన గాయాలకు చికిత్స అందించడం, వాటిని పునర్నిర్మించడం, ఎలా యానిమేట్ చేయ డం వంటి అంశాలపై తన అనుభవాలను వివరించారు. ఉస్మానియా ఆస్పత్రిలో బాధితులకు అందించిన చికిత్స వివరాలను చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఆమె సభ్యురాలిగా ఎంపికైంది. ఎయిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రోహిత్ముల, ఉస్మానియా నుంచి వైద్య విద్యార్థులు సందీప్‌రెడ్డి, స్వాతి, శంకర్, అజోలు ప్లాస్టిక్ ఛాలెంజ్‌లో పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

● డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి



యూపీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సిబ్బంది అందరూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎం అండ్ హెచ్‌ఓ) డాక్టర్ జె.వెంకటి ఆదేశించారు. గురువారం రసూల్‌పురాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)తో పాటు చంద్రబాబు నగర్‌లోని బస్తీ దవాఖానాను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది విధుల నిర్వహణ, సమయపాలన, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, ఔషధ నిల్వలు, ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలు, రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత పాటించాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, రోగులకు వసతి, దోమలు, నీటి ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

నెలవారీ సమీక్ష..

వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ల నెలవారీ సమీక్ష సమావేశంలో డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి పాల్గొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలలో ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలు, గర్భిణుల నమోదు, పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు తమ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, బస్తీ దవాఖానాలను విధిగా సందర్శించి, ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని డీఎం అండ్ హెచ్‌ఓ సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్.ఓ డాక్టర్ జయమాలిని, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రుక్మారెడ్డి, డాక్టర్ ఆశ్రిత, కార్యాలయ పరిపాలనాధికారి సునీల్ కుమార్, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, డిప్యూటీ డెమోలు, డీపీఓ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.